క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని తహర్థాన్ పేట షిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, స్థానికులు ఆంజనేయులు, చంద్రశేఖర్‌గౌడ్, వీరేందర్, భక్తులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని లాల్ సాబ్ గడ్డ 24వ వార్డులో మాజీ కౌన్సిలర్ నజీముద్దీన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, మక్సూద్, అబ్దుల్లా, కోఆప్షన్ సభ్యులు షకీల్, గోవర్ధన్‌నాయక్, నర్సింహులు, మసూద్, చక్రపాణి, నాని, సమి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఎంపీటీసీ లావణ్య, గ్రామ పంచాయతీ ఈఓ లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలోని అవసరమైన అన్ని రోడ్లను సీసీలుగా మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కోటేశ్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో సేవాభావం ఉండాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రతిఒక్కరిలోనూ సేవాభావం ఉండాలని డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ రాజీవ్ చౌక్ ప్రాంతంలో స్థానిక జమాతే ఆహలేహదీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, ప్రజల దప్పికను తీర్చడానికి సేవాభావంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంఘ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, మాజీ మార్కెట్కమిటి వైస్ చైర్మన్ ముంతాజ్, మాజీ ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, పండరిరెడ్డి, సంఘం నాయకులు మైనొద్దిన్, సుబూర్, వాజీద్, రశీద్, యూసుఫ్, హబీబ్, ముల్తాన్‌సాబ్, నజీర్, ముజ్జు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

ఝరాసంగం(జహీరాబాద్): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ సునీల్‌దత్ అన్నారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశు వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జహీరాబాద్: రంజోల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ బస్వరాజ్



జిన్నారం: బొల్లారంలోని పరీక్షాకేంద్రం వద్ద హాల్‌టికెట్లను చూపుతున్న విద్యార్థినులు

‘పది’ పరీక్షలు ప్రారంభం

జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.



ఝరాసంగం: జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రం వద్ద..



పటాన్‌చెరు టౌన్: ఎస్టీ జోసెఫ్ హైస్కూల్ వద్ద..



హత్నూర: పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ల నెంబర్లను చూసుకుంటూ..



రాయికోడ్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఎంఈఓ చొరవతో పరీక్షకు హాజరు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంఈఓ ప్రత్యేక చొరవతో ఓ విద్యార్థిని పదో తరగతి పరీక్షలకు హాజరైంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని మలపాడ్ గ్రామానికి చెందిన హరిజన్ రూప పుల్కల్ కేజీబీవీలో చదువుతోంది. గత ఆరు నెలలుగా పాఠశాలకు రాకుండా కూలి పని చేస్తోంది. అయితే ఈ నెల 17వ తేదీ వరకు హాల్ టికెట్ తీసుకోకపోగా పరీక్షలు రాయడానికి నిరాకరించింది. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి దండు అంజయ్య బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. దీంతో పరీక్షలు రాసేందుకు విద్యార్థిని ఒప్పుకుంది. సోమవారం సింగూర్ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన తెలుగు పరీక్షకు విద్యార్థిని రూప హాజరైంది. సహకరించిన మలపాడ్ మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సీఆర్పీలు నిరంజన్, మల్లేశం,ప్రధానోపాధ్యాయులు గోవింద రావుకు ఎంఈఓ అభినందనలు తెలిపారు.

కాలు విరిగినా.. పరీక్షకు హాజరు

నారాయణఖేడ్: మెదక్ జిల్లా రేగోడు మండల పరిధిలోని ప్యారారం గ్రామానికి చెందిన దినేష్ ఖేడ్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వారం కిందట ఖేడ్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పగా కిందపడిపోయాడు. దీంతో కాలు విరగగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్ష రాయాలనే కార్యదీక్షతో సోదరుల సహాయంతో ఖేడ్‌లోని పరీక్షా కేంద్రానికి వచ్చాడు. సొంత గ్రామం నుంచి పరీక్షా కేంద్రం వద్దకు వాహనంలో వచ్చి అక్కడి నుంచి పరీక్షా కేంద్రంలోని తనకు కేటాయించిన గది వరకు సోదరుల సహాయంతో వెళ్లి పరీక్ష రాశాడు.



సోదరుల సహాయంతో పరీక్షా కేంద్రానికి వస్తున్న దినేష్

పోషక విలువలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ సెక్టార్ పరిధిలో ఉన్న గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సునితాబాయి చిరుధాన్యాల నుంచి అందే పోషకాల గురించి గర్భిణులు, మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజమ్మ, సునిత, తులసి, విజయలక్ష్మి, నీరజ, అనిత కుమారి, రాధ, అంగన్‌వాడీ టీచర్ అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ సునితాబాయి

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

పార్లమెంట్ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ రాజు అన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు ఏర్పడకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

మాజీ ఎంపీటీసీ మక్బూల్ మృతి



మక్బూల్(ఫైల్)

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మాజీ ఎంపీటీసీ మక్బూల్ అహ్మద్(56) సోమవారం సాయంత్రం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోహీర్ పట్టణంలోని సుల్తాన్‌వాడిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడైన మక్బూల్ అనారోగ్య కారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మక్బూల్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళ అదృశ్యం



మాధవి

జిన్నారం: మహిళ అదృశ్యమైన ఘటన గుమ్మడిదలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదలకు చెందిన పుదరి నర్సింహులు భార్య మాధవి ఈ నెల 16న ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త నర్సింహులు సోమవారం గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల మేరకు.. పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గీతం యూనివర్సిటీ సమీపంలో మూడు రోజుల క్రితం మూతపడిన హోటల్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా గుర్తుతెలియని యాచకుడిగా గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో మూడు రోజులు గడిచినా మృతుడి బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ **కళ్లద్దాలు పంపిణీ**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పలువురుకి ఉచితంగా కళ్లద్దాలను సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించి 1200 మంది పరీక్షలు నిర్వహించారు. కొంతమంది కంటిచూపుతో బాధపడుతున్నారని గుర్తించారు. కళ్ల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు.

◆ **జహీరాబాద్‌కు చేరుకున్న గోమాత మహా పాదయాత్ర**

జహీరాబాద్ టౌన్: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బొమ్మంచి కనకాల దేవికా చేపట్టిన గోమాత మహా పాదయాత్ర సోమవారం జహీరాబాద్‌కు చేరుకుంది. ఈ నెల 13న హైదరాబాద్‌లోని సైనిక్‌పురి ప్రారంభించిన పాదయాత్రా మహారాష్ట్రలోని తుల్జపూర్ వరకు కొనసాగుతుంది. పట్టణానికి చేరుకున్న పాదయాత్రను బీజేపీ నాయకులు జగన్నాథ్ తదితరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకాల దేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ స్వామి, సిదప్ప, అశోక్, విఠల్, సతీష్, శివ, కిషన్ రాథోడ్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా మల్లికార్జునస్వామి జాతర**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

◆ **సన్మాన సభను విజయవంతం చేయండి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్గా నియమితులైన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న మంగళవారం పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

◆ **మంత్రిని కలిసిన గరిధర్‌రెడ్డి**



జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఫిలం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఫిలం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు గిరిధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉన్నారు.

టీజీ ఆర్డీసీ సెట్ దరఖాస్తుల స్వీకరణ

మునిపల్లి(అందోల్): టీజీఆర్డీసీ సెట్ 2024–20025 మొదటి సంవత్సరానికి సంబంధించి డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిఫా తెహసీన్ ఆరా తెలిపారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో వివిధ రకాల కోర్సులకు సంబంధించి అధ్యాపకులతో కలిసి సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీలో మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 12వ తేదీ వరకు గడువు ఉండగా 28వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదాయం రూ.లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షల వరకు పరిమితి ఉందన్నారు. బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం (బిజినెస్ అనలటిక్స్), బీకాం (హానర్స్) బీకాం (జనరల్), బీబీఏ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కరపత్రాలను చూపిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



బహుమతులు అందుకున్న గెలుపొందిన టీమ్ సభ్యులు

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్

సదాశివపేట(సంగారెడ్డి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, యువత క్రీడల్లో రాణించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకొని సదాశివపేట పట్టణంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విన్నర్‌గా నిలిచిన కోమా టీం బాయ్స్, రన్నర్‌గా నిలిచిన జైభీమ్ టీం సభ్యులకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. మ్యాన్ ఆఫ్‌ద సీరిస్, బెస్ట్ బ్యాట్‌మన్‌గా చిన్న, బెస్ట్ బౌలర్ వికెట్స్ కుమార్‌కు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్‌కుమార్, మాణిక్యం, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు



ఉర్మిళరెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్ ప్రాథమిక సహకార సంఘం (సీడెడ్) సొసైటీ చైర్‌పర్సన్‌కు అవిశ్వాసం సెగ తాకింది. సంజీవన్‌రావుపేట్ పీఏసీఎస్ చైర్మన్ ఉర్మిళరెడ్డిని పదవి నుంచి తొలగించాలని కోరుతూ 9 మంది డైరెక్టర్లు కలెక్టర్, జిల్లా సహకార అధికారికి నోటీసును అందజేశారు. మెజార్టీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసంపై ఏప్రిల్ 2వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ డైరెక్టర్లకు జిల్లా సహకార అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సొసైటీలో 13మంది డైరెక్టర్లు కాగా ఇందులోంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన శంకర్‌రావు, రుక్కమ్మ, సంజీవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దినాకర్‌రావు, సుందరమ్మ, కిమ్యానాయక్, సుశీల, కిషన్, తదితరులు కలిసి అవిశ్వాసం నోటీసును ఇటీవల జిల్లా సహకార అధికారికి, జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అవిశ్వాసంపై అధికారులు 2వ తేదీన సమావేశం ఏర్పాటు చేస్తూ సభ్యులకు నోటీసులను అందజేశారు.

చెత్తను తొలగించి.. పరిసరాలను శుభ్రం చేసి...

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేసే పనులను సోమవారం రెవెన్యూ అధికారులు ప్రాంభించారు. ఈ నెల 16న సాక్షి దినపత్రికలో ‘కళావిహీనం.. తహసీల్దార్ కార్యాలయం’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పర్యవేక్షణ లేక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని చెట్లు, మొక్కలు ఎండిపోయి కార్యాలయం కళావిహీనంగా తయారైంది. బోరుమోటారు ఉన్నా నీరు పట్టేవారు కరువయ్యారు. దీంతో కార్యాలయ ఆవరణ అటవీప్రాంతాన్ని తలపిస్తోంది. ‘సాక్షి’ కథనంతో అధికారులు స్పందించి రాలిపోయిన ఆకులతో పాటు ఎండిపోయిన మొక్కలను తొలగించి పరిసరాల పరిశుభ్రత పనులను ప్రారంభించారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

రక్తదానం.. మహాదానం



రక్తదానం చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి: చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట్ సిబిల్ పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ ఏర్పడి 25 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లేబర్ ఆఫీస్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సామాజిక బాధ్యతను గుర్తించి పేదలకు ఉపయోగపడే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడంపై అభినందనీయమని కొనియాడారు. 9 అగ్రిమెంట్లు పూర్తి చేసుకొని ఒకటే యూనియన్ కింద పనిచేయడం గొప్ప విషయమని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు బాలరెడ్డి, సిబిల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, యూనియన్ ఆఫీస్ బేరర్ నాగభూషణం, మల్లారెడ్డి, సత్యనారాయణ, చంద్రయ్య, దేవరాజ్, కమిటీ సభ్యులు విఠల్, లక్ష్మణ్, నరేష్, మైపాల్ పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు మొగుడంపల్లి మండలంలోని మాడ్గి, న్యాల్‌కల్ మండలం హుసెళ్లి, కోహీర్ మండలం మనియార్‌పల్లి ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలు తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నందునా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు.

పరీక్షలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

వట్‌పల్లి(అందోల్): పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా పరీక్షలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 144 ఆంక్షలు అమలులో ఉన్నందునా పరీక్షా కేంద్రాల సమీపంలో ఎవరూ గుమికూడరాదన్నారు. కొందరూ వ్యక్తులు రిపోర్టర్లుగా పేరు చెబుతూ పరీక్ష కేంద్రాల వద్ద బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ విలేకరులుగా తేలితే ఎంతటివారైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన చెట్లకింద రమేశ్‌కు చెందిన ఎద్దు శివారులో మేతమేస్తున్న సమయంలో ఎద్దుపై పిడుగుపడటంతో అక్కడిక్కడే మృతి చెందింది. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

నేడు రైతునేస్తం కార్యక్రమం

సంగారెడ్డి టౌన్: రైతు వేదికలలో శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు సూచనలు అందించటం కోసం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి నర్సింగారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మంగళవారం ఈ రైతు నేస్తం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ వారం వరిలో పాటించే జాగ్రత్తలు, ఆయిల్ ఫామ్ సాగు, కూరగాయలు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు ఇస్తారన్నారు. నేడు కొండాపూర్, జహీరాబాద్, సిర్గాపూర్, అందోల్, జిన్నారం మండలాల్లో రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు.